జగనన్నను మరోసారి దీవించండి

● కార్మిక శాఖ మంత్రి
గుమ్మనూరు జయరాం


ఆస్పరిలో కుళాయిని ప్రారంభిస్తున్న మంత్రి గుమ్మనూరు జయరాం

ఆస్పరి: ప్రజారంజక పాలన అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి దీవించాలని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం ప్రజలను కోరారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా సోమవారం ఆస్పరిలో పర్యటించారు. ముందుగా సోమప్ప ఆలయంలో మంత్రి ప్రత్యేక పూజలు చేశారు. కాసేపు సచివాలయంలో సిబ్బందితో సమావేశమై ప్రజలకు అందుతున్న సేవలు గురించి చర్చించారు. పార్టీలకు అతీతంగా ప్రతి పేదవాడికీ సంక్షేమ ఫలాలు అందేలా చూడాలని ఆదేశించారు. అనంతరం సర్పంచ్ మూలింటి రాధమ్మ, కేడీసీసీ బ్యాంక్ డైరెక్టర్ మూలింటి రాఘవేంద్రతో కలిసి ఇంటింటికి వెళ్లి సమస్యలు తెలుసుకున్నారు. ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా లేదా అని ఆరా తీశారు. మూడున్నరేళ్లలో ప్రభుత్వం ద్వారా పొందిన లబ్ధిని వివరించి బుక్‌లెట్‌ను అందజేశారు. పాఠశాలను సందర్శించి విద్యార్థులతో ముచ్చటించారు. ఎస్సీ కాలనీలో రూ.4 లక్షలతో చేపట్టిన కుళాయిలను ప్రారంభించారు. సమీపంలో చాకలి లక్ష్మి బంక్‌లో దుస్తులను ఇస్త్రీ చేస్తుండగా ఆప్యాయంగా పలకరించారు. స్త్రీ పట్టుకుని దుస్తులను ఇస్త్రీ చేశారు. కార్యక్రమంలో దేవరగట్టు ఆలయ చైర్మన్ గుమ్మనూరు శ్రీనివాసులు, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గుమ్మనూరు నారాయణస్వామి, మండల సొసైటీ చైర్మన్ గోవర్ధన, జెడ్పీటీసీ సభ్యుడు దొరబాబు, సీఈఓ అశోక్, ఈఓ రామాంజనేయులు,ఎంపీటీసీ సభ్యురాలు మహాలక్ష్మి, లింగమ్మ,ఉప సర్పంచ్ వెంకటేశ్వరమ్మ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పెద్దయ్య పాల్గొన్నారు.

నేడు చిప్పగిరి మండలంలో..

చిప్పగిరి: మండలంలోని దౌల్తాపురం, నంచర్ల గ్రామాల్లో మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గుమ్మనూరు నారాయణ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ మంత్రి గుమ్మనూరు జయరాం పాల్గొంటున్న గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి నాయకులు, కార్యకర్తలు, అధికారులు హాజరు కావాలన్నారు.

జలజీవన్ మిషన్ పనులు ప్రారంభం


జల జీవన్ మిషన్ పనులు ప్రారంభిస్తున్న దృశ్యం

మద్దికెర: జల జీవన్ మిషన్ పనులను మండల పరిధిలోని బురుజుల గ్రామంలో సోమవారం సహకార సంఘం అధ్యక్షుడు సుబ్బయ్య ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలు నీటి కోసం ఇబ్బందులు పడకుండా ఇంటింటికి కుళాయి పథకం ద్వారా సమస్యను పరిష్కరించనున్నట్లు చెప్పారు.

క్లుప్తంగా

ఉచిత నైపుణ్యాభివృద్ధి శిక్షణకు 25న రిజిస్ట్రేషన్

పత్తికొండ టౌన్: నియోజకవర్గంలోని యువతకు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్కిల్ హబ్ ద్వారా ఉచిత నైపుణ్యాభివృద్ధి శిక్షణ ఇస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఆర్.మాధురి సోమవారం తెలిపారు. కళాశాల ప్రాంగణంలో ఈనెల 25న రిజిస్ట్రేషన్ ఉంటుందన్నారు. మూడు నెలల శిక్షణ సమయంలో ఉచిత బస్‌పాస్ సౌకర్యం కల్పిస్తామన్నారు. ఆసక్తి ఉన్న నిరుద్యోగ యువతీ, యువకులు బయోడేటా,విద్యార్హత సర్టిఫికెట్స్ జిరాక్స్‌కాపీలు, ఆధార్‌కార్డు తీసుకు రావాలన్నారు. మరిన్ని వివరాలకు 9014588552ను సంప్రదించాలని సూచించారు.

గ్రంథాలయాలు విజ్ఞాన నిలయాలు

పత్తికొండ రూరల్: గ్రంథాలయాలు విజ్ఞాన నిలయాలని ఎంఈఓ మస్తాన్‌వలి అన్నారు. స్థానిక మర్రోపేట పాఠశాల విద్యార్థులతో గ్రంథాలయ సభ్యత్వం చేయించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ బడిలో పాఠ్య పుస్తకాలతో పాటు మిగిలిన సమయంలో పత్రికలు, పుస్తకాలు చదవడం అలవర్చుకుని చిన్నతనం నుంచే సామాజిక అవగాహన పెంపొందించుకోవాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి రాంకుమార్, హెచ్‌ఎం కాశీంసాహెబ్, ఉపాధ్యాయుడు రామ్మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

నేడు దేవమ్మ అవ్వ విగ్రహ ప్రతిష్ట

ఆలూరు రూరల్: మండలంలోని మనేకుర్తి గ్రామంలో మంగళవారం దేవమ్మ అవ్వ ఆలయంలో విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం ఉంటుందని ఆలయ కమిటీ నిర్వాహకులు తెలిపారు.

జిరాక్స్ మిషన్ విరాళం


జిరాక్స్ మిషన్‌ను అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

మద్దికెర: స్థానిక జిల్లా పరిషత్ బాలుర పాఠశాలకు 1983–84వ బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు సోమవారం రూ.15 వేలు విలువ చేసే జిరాక్స్ మిషన్‌ను విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం అగస్టీన్, పూర్వ విద్యార్థులు ఆర్‌టీసీ మల్లికార్జున, రామకృష్ణ, మురళీ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం


క్రీడాకారుడికి ఆర్థిక సాయం అందిస్తున్న దృశ్యం

ఎమ్మిగనూరు టౌన్: కబడ్డీ క్రీడాకారుడికి మల్లెల గ్రూప్స్ అధినేత మల్లెల ఆల్‌ఫ్రెడ్‌రాజు తన వంతు ఆర్థిక సాయం చేశారు. ఈనెల 25న విశాఖలో రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ నిర్వహిస్తున్న కబడ్డీ పోటీలకు ఎంపికైన షాషావలికి రవాణా ఖర్చుల నిమిత్తం రూ.5వేల నగదును ఆల్‌ఫ్రెడ్ రాజు అందించారు. కార్యక్రమంలో కబడ్డీ అసోసియేషన్ నాయకులు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

తీర్పు వెలువడేవరకు భూమిలోకెళ్లొద్దు

ఎమ్మిగనూరు రూరల్: తీర్పు వెలువడేవరకు వివాదాస్పద భూమిలోకి అడుగు పెట్టొద్దని ఇరు వర్గాలను టౌన్ సీఐ మధుసూదన్‌రావు హెచ్చరించారు. సోమవారం సాయంత్రం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పట్టణ శివారుల్లోని 145, 146, 148/సీ సర్వే నంబర్లలో ఉన్న7.92 ఎకరాల పొలానికి సంబంధించి బొరుగుల బట్టి నరసన్న, కడిమెట్ల విరుపాక్షిరెడ్డిల మధ్య వివాదం ఉందని, ఇదే విషయమై కోర్టులో కేసు నడుస్తోందని చెప్పారు. కోర్టు తీర్పు వచ్చే వరకు ఎవరూ పొలంలోకి వెళ్లరాదని తహసీల్దార్ జయన్న సెక్షన్ 145 కింద ఇరువురికీ నోటీసులు ఇచ్చారన్నారు. గొడవలకు పాల్పడినా, శాంతి భద్రతలకు విఘాతం కలిగించినా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

ఆలూరు ఎస్‌ఐగా డాక్టర్ నాయక్



ఆలూరు రూరల్: ఆలూరు ఎస్‌ఐగా డాక్టర్ నాయక్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న ఎస్‌ఐ రామాంజులు స్పెషల్ బ్రాంచ్‌కు బదిలీ కావడంతో ఆయన స్థానంలో వైఎస్సార్ కడప జిల్లా చాపాడు ఎస్‌ఐ డాక్టర్ నాయక్ నియమిస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. బాధ్యతలు చేపట్టిన సందర్భంగా నూతన ఎస్‌ఐ మాట్లాడుతూ శాంతిభద్రతలకు విఘాతం కలిగించేవారిపై ప్రత్యేక దృష్టిసారిస్తామన్నారు.

'పీఎంశ్రీ'కి రెండు పాఠశాలల ఎంపిక

తుగ్గలి: పీఎంశ్రీ పథకానికి మండలంలో రెండు పాఠశాలలు ఎంపికైనట్లు ఇన్‌చార్జ్ ఎంఈఓ రామవెంకటేశ్వర్లు సోమవారం తెలిపారు. జొన్నగిరి జెడ్పీ ఉన్నత పాఠశాల, మెయిన్ ప్రాథమిక పాఠశాల పీఎంశ్రీ పథకానికి ఎంపికయ్యాయన్నారు. ఈ పాఠశాలల్లో ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం నాడు–నేడు పథకం కింద మౌలిక వసతులు, తాగునీరు, అదనపు తరగతి గదుల నిర్మాణాలు చేపట్టినట్లు చెప్పారు. పీఎంశ్రీ పథకం ద్వారా ప్రత్యేక నిధులు మంజూరవుతాయన్నారు.

అమ్మవారి ఆత్మార్పణ దినం

ఆస్పరి: కన్యకా పరమేశ్వరీ మాత ఆత్మార్పణ దినాన్ని పురస్కరించుకుని మండల కేంద్రంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సోమవారం ఆలయంలో పూజారి మల్లికార్జున స్వామి ఆధ్వర్యంలో అమ్మ వారికి గంగ, ఆకు పూజ, కుంకుమార్చన, మంగళహారతులు తదితర కార్యక్రమాలు నిర్వహించారు. అమ్మవారిని భక్తులు దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు రఘు, పవన్, మహేంద్ర తదితరులు పాల్గొన్నారు.

వెల్దుర్తి: వాసవీమాత ఆత్మార్పణ దినాన్ని పురస్కరించుకుని స్థానిక అమ్మవారిశాలలో మహిళలు అమ్మ వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఘనంగా నీలకంఠుడి వార్షికోత్సవం


శివ పార్వతుల కల్యాణం జరిపిస్తున్న అర్చకులు రామారావు

గోనెగండ్ల: మండల కేంద్రంలోని వీవర్స్ కాలనీలో నీలకంఠేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవాన్ని కుర్ని దైవాచార సంఘం సభ్యుల ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. అర్చకులు రామారావు గణపతిపూజ, నవగ్రహపూజ, స్వామి వారి నిర్మలాభిషేకం, పంచామృతాభిషేకం, అలంకరణ పూజ కార్యక్రమాలతో పాటు శివ పార్వతుల కల్యాణం జరిపించారు. గౌరి వ్రతం అనంతరం పల్లకీ ఉత్సవాన్ని నిర్వహించారు.

వైఎస్సార్‌సీపీతోనే అభివృద్ధి సాధ్యం


నసురుద్దీన్, బందె నవాజ్‌లను సన్మానిస్తున్న దృశ్యం

గోనెగండ్ల: గ్రామాల అభివృద్ధి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంతోనే సాధ్యమని ఎంపీపీ టి.నసురుద్దీన్, కోఆప్షన్ మాజీ మెంబర్ బందె నవాజ్‌లు పేర్కొన్నారు. స్థానిక ఎస్సీ కాలనీలోని ఓవర్ హెడ్ ట్యాంక్ సమీపంలో నెలకొన్న రస్తా, డ్రైనేజీ సమస్యను ఎమ్మెల్యే చెన్నకేశవ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించారు. దీంతో సోమవారం కాలనీవసులు నసురుద్దీన్, బందె నవాజ్‌లను సన్మానించారు.

ఉపాధ్యాయులను నియమించాలి

హొళగుంద: స్థానిక పాఠశాలలో విద్యార్థుల సంఖ్యకు తగిన విధంగా ఉపాధ్యాయులను నియమించాలని తెలుగునాడు స్టూడెంట్ ఫెడరేషన్ (టీఎస్‌ఎస్‌ఎఫ్) నాయకులు నాగరాజు, మల్లికార్జున, సురేష్ శెట్టి డిమాండ్ చేశారు. మండలంలోని విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సోమవారం వారు స్థానిక బస్టాండులో విద్యా పరిరక్షణ పేరుతో దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఫెడరేషన్ నాయకులు మాట్లాడుతూ 10వ తరగతి పబ్లిక్ పరీక్షలు సమీపిస్తుండటంతో వలంటీర్లను నియమించి సిలబస్ పూర్తి చేయించాలని, మూతపడిన ఎస్సీ హాస్టల్‌ను తెరిపించాలని, రెగ్యులర్ ఎంఈఓను నియమించాలని కోరారు. దీక్షలకు టీడీపీ, ఏఐఎస్‌ఎఫ్, ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు మద్దతు తెలిపారు.


పూజలందుకున్న నల్లారెడ్డి స్వామి


హోమం నిర్వహిస్తున్న భక్తులు

ఘనంగా ఆరాధన

ఆస్పరి: మండలంలోని తంగరడోణ గ్రామంలో వెలసిన చింతలముని, నల్లారెడ్డి స్వామి ఆరాధనోత్సవాలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్ పార్వతి ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు ప్రత్యేక పూజలు చేశారు. పూజారి నారాయణస్వామి ఆలయాల్లో గణపతి పూజ, ప్రాతఃకాలపూజ, నవగ్రహ వాస్తు, మృత్యుంజయ హోమం, కూస్మాండ బలి ప్రదానము, అభిషేకాలు, గణపతి హోమం, మహా మంగళహారతులు, రుద్రహోమం, రుద్రాభిషేకం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. మండలంలోని ఆస్పరి, తురువగల్లు, తొగలుగల్లు, దొడగొండ, యాటకల్లు, బైలుపత్తికొండ, గార్లపెంట గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వాములను దర్శించుకుని కానుకలు సమర్పించారు.

నేతాజీకి ఘన నివాళి

నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతిని సోమవారం ఆలూరు, హొళగుంద, పత్తికొండ, ఎమ్మిగనూరు మండలాల్లో ఘనంగా నిర్వహించారు. నేతాజీ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. దేశ స్వాతంత్ర్యం కోసం ఆయన చేసిన త్యాగాలను గుర్తు చేసుకున్నారు.



హొళగుంద: నేతాజీ చిత్రపటానికి సెల్యూట్ చేస్తున్న ఎస్‌ఐ, ఎమ్మిగనూరులో నివాళులర్పిస్తున్న దృశ్యం

ఆలూరు రూరల్: స్థానిక గ్రంథాలయంలో సుభాష్ చంద్రబోస్ చిత్రపటానికి గ్రంథాలయ కమిటీ చైర్మన్ రాంమూర్తి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరంలో బ్రిటీషు వారిపై సుభాష్ చంద్రబోస్ వీరోచిత పోరాటం చేశారన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి వెంకటేశ్వర్లు, రిటైర్డ్ ఉపాధ్యాయుడు వీరాస్వామి తదితరులు పాల్గొన్నారు.

☛ **హొళగుంద:** స్థానిక పోలీస్ స్టేషన్‌లో సిబ్బందితో కలిసి ఎస్‌ఐ అబ్దుల్‌జహీర్.. నేతాజీ చిత్రపటానికి నివాళులర్పించారు.

☛ **ఎమ్మిగనూరుటౌన్:** స్థానిక ఎస్‌ఎంఎల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సుభాష్ చంద్రబోస్ జయంతి సందర్భంగా పరాక్రమ దివస్‌ను చేపట్టారు. నేతాజీ చిత్రపటానికి కళాశాల వైస్ ప్రిన్సిపాల్ విజయ్ కుమార్ పూలమాల వేసి నివాళుల ర్పించారు. కార్యక్రమంలో అధ్యాపకులు కిరణ్‌కుమార్‌గౌడ్, ఈరన్న, తిరుపతిరెడ్డి, క్రాంతికుమార్, హరీష్‌బాబు పాల్గొన్నారు.

☛ **పత్తికొండ రూరల్:** స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం నేతాజీ సుభాష్‌చంద్రబోస్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ సోమశేఖర్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో నేతాజీ చిత్రపటానికి వైస్ ప్రిన్సిపాల్ సుబ్బయ్య పూలమాల వేసి నివాళులర్పించారు. దేశ స్వాతంత్ర్యం కోసం ఇండియన్ సివిల్ సర్వీసెస్‌లో ఉద్యోగాన్ని, నేషనల్ కాంగ్రెస్ అధ్యక్ష పదవిని తృణప్రాయంగా త్యజించిన త్యాగధనుడని కీర్తించారు. కార్యక్రమంలో అధ్యాపకులు సాయిశశిధర్, వీరాంజనేయులు, రామకృష్ణ, ఇందిరాదేవి పాల్గొన్నారు.

ప్రజల మన్ననలు పొందాలి

● సచివాలయ కన్వీనర్ల సమావేశంలో
ఎమ్మెల్యే ఎర్రకోట చెన్నకేశవరెడ్డి


సమావేశంలో పాల్గొన్న సచివాలయ కన్వీనర్లు


మాట్లాడుతున్న ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి

ఎమ్మిగనూరు టౌన్: సంక్షేమ ఫలాలను ప్రజల చెంతకు చేర్చి వారి మన్ననలు పొందాలని ఎమ్మిగనూరు ఎమ్మెల్యే ఎర్రకోట చెన్నకేశవరెడ్డి సూచించారు. స్థానిక ఉప్పర కల్యాణ మండపంలో సోమవారం ఏర్పాటు చేసిన సచివాలయ కన్వీనర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీ కోసం పని చేసే కార్యకర్తలను గుర్తించాలన్నారు. వారిలో 50 ఇళ్లకు ఇద్దరిని గృహసారథులు ఎంపిక చేయాలన్నారు. ఈప్రక్రియ నెలాఖరులోగా పూర్తి కావాలన్నారు. ఆ తర్వాత గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు, జేసీఎస్ మండలాల ఇన్‌చార్జ్‌లు ప్రజలతో మమేకమై పనిచేయాలన్నారు. పార్టీలు, కులమతాలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందించేందుకు కృషి చేయాలన్నారు. సచివాలయ, వలంటీర్ వ్యవస్థలతో ప్రభుత్వానికి మంచి పేరొచ్చిందన్నారు. దాన్ని నిలబెట్టాల్సిన బాధ్యతతో పాటు మరోసారి పార్టీని గెలిపించి అధికారంలోకి వచ్చేలా చూడాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందన్నారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బీఆర్ బసిరెడ్డి, ఎంపీపీ కేశన్న, మున్సిపల్ వైస్ చైర్మన్ నజీర్‌అహమ్మద్, వక్ఫ్‌బోర్డు జిల్లా ఉపాధ్యక్షుడు రియాజ్‌అహమ్మద్, పార్టీ నాయకులు బంగి శ్రీరాం, కౌన్సిలర్ అమాన్, కోఆపరేటివ్ స్టోర్స్ చైర్మన్ షబ్బీర్‌అహమ్మద్, మున్సిపల్ కౌన్సిలర్లు, వార్డు ఇన్‌చార్జ్‌లు పాల్గొన్నారు.

నిందితుడిపై చర్యలు తీసుకోవాలి

తుగ్గలి: అప్పు తీసుకొని తిరిగి చెల్లించకుండా ఆస్తులు కూడబెట్టుకున్న పెండేకల్లు ఆర్‌ఎస్‌కు చెందిన బొగ్గుల బ్రహ్మయ్యపై చర్యలు తీసుకోవాలని సీపీఎం మండల కార్యదర్శి శ్రీరాము లు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట బాధితులతో కలిసి ఆయన ఆందోళన చేపట్టారు. రాంపల్లి, పెండేకల్లు ఆర్‌ఎస్, ఇందిరాంపల్లికి చెందిన పలువురి నుంచి రూ.20.20 లక్షలు అప్పుగా తీసుకున్నాడన్నారు.అప్పుగా తీసుకున్న డబ్బు తో ఆస్తులు కూడబెట్టుకున్నాడని ఆరోపించారు. అధికారులు స్పందించి బ్రహ్మయ్యపై చర్యలు తీసుకొని బాధితులకు న్యాయం చేయాలని వారు కోరుతూ తహసీల్దార్ రవికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు కొండారెడ్డి, శ్రీనివాసులు పాల్గొన్నారు.

మౌలిక వసతులు కల్పించాలి

గోనెగండ్ల: జగనన్న కాలనీలలో సీసీ రోడ్లు, విద్యుత్, తాగు నీరు తదితర మౌలిక వసతులు కల్పించాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు పంపన్న గౌడ్, మండల కార్యదర్శి, సహాయ కార్యదర్శులు నాగప్ప, మునిస్వామి డిమాండ్ చేశారు. సోమవారం వారు మాట్లాడుతూ జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలను వేగంగా పూర్తి చేసి అన్ని సౌకర్యాలు కల్పించాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు శ్రీనివాసులు, గిడ్డయ్య, శ్రీరాములు, చాంద్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఆశయసాధనకు కృషి

ఎమ్మిగనూరు టౌన్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి చేస్తామని జై భీం ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు చిక్కం జానయ్య తెలిపారు. సోమవారం స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథి గృహ ఆవరణలో ఆయన మాట్లాడారు. జై భీం ఎమ్మార్పీఎస్ బలోపేతానికి ఉమ్మడి కర్నూలు జిల్లాలో కార్యాలయాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలు ఆయా కార్యక్రమాలకు హాజరు కావాలని కోరారు. బహుజనులను రాజ్యాధికారం వైపు నడిపించేలా చైతన్యం చేయడమే తమ లక్ష్యమన్నారు. సమావేశంలో సంఘం నాయకులు ముత్తు సుమాల, సురేష్, హనుమన్న పాల్గొన్నారు.

మారెమ్మ అవ్వకు రూ.7లక్షల ఆదాయం

ఆలూరు: దేవనకొండ మండలం గద్దెరాళ్ల మారెమ్మ అవ్వకు వేలం ద్వారా రూ.7లక్షలకు పైగా ఆదాయం సమకూరింది. ఆలయంలో టెంకాయల విక్రయానికి, వాహనాల టోల్‌గేట్ వసూలుకు సోమవారం దేవదాయశాఖ ఈఓ చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం ఆలయ ఆవరణంలో వేలం పాట నిర్వహించారు. ఈ ఏడాది మార్చి 10 నుంచి ఏప్రిల్ 25వ తేదీ వరకు టెంకాయల విక్రయానికి రూ.6 లక్షలకు ఎం.కౌలుట్లయ్య, వాహనాల టోల్‌గేట్ వసూలుకు రూ.1.35 లక్షలకు నెట్టికల్లు వేలం పాట పాడి దక్కించుకున్నారు. కార్యక్రమంలో దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

విద్యార్థులకు డిజిటల్ సేవలు

మద్దికెర: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రధానమంత్రి గ్రామీణ డిజిటల్ సాక్షర్ అభియాన్ పథకం ద్వారా గ్రామీణ విద్యార్థులకు డిజిటల్ సేవలను అందించడానికి కృషి చేస్తుందని ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ సవితా అన్నారు. సోమవారం స్థానిక ఆదర్శ పాఠశాల విద్యార్థులకు వొకేషనల్ ట్రెనింగ్ ఇచ్చి అప్రిసియేషన్ డిజిటల్ లిటరసీ ధ్రువపత్రాలు అందించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ పోటీ ప్రపంచంలో రాణించాలంటే కంప్యూటర్ పరిజ్ఞానం తప్పనిసరిగా ఉండాలన్నారు.

క్షేమంగా ఇంటికి చేరుకోవాలి

● మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ శిశిరదీప్తి



మాట్లాడుతున్న ఆదోని ఎంవీఐ

ఎమ్మిగనూరు టౌన్: నిబంధనలు పాటిస్తూ వాహనాలు నడిపి క్షేమంగా ఇంటికి చేరుకోవాలని ఆదోని మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ శిశిరదీప్తి డ్రైవర్లకు సూచించారు. సోమవారం స్థానిక ఇండోర్ స్టేడియం ఆవరణలో రోడ్డు భద్రత, ప్రమాదాల నివారణలపై ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. ప్రతి వాహనదారుడు డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలన్నారు. ద్విచక్రవాహనదారులు హెల్మెట్, నాలుగు చక్రాల వాహనదారులు సీటుబెల్ట్ తప్పకుండా వాడాలన్నారు. మద్యం తాగి వాహనాలు నడిపి ప్రమాదాల బారిన పడి జీవితాలను నాశనం చేసుకోవద్దని సూచించారు. కుటుంబ సభ్యులు తమమీద ఆధార పడి ఉంటారనే విషయాన్ని పదేపదే గుర్తించుకుని వాహనాలు నడపాలన్నారు. బైక్‌లు, ఆటోలకు ఎల్‌ఈడీ లైట్లు ఏర్పాటు చేసుకోవడం వల్ల ఎదురుగా వచ్చే వాహనదారులకు రోడ్డు కనిపించక ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. అలాంటి లైట్లు బిగించుకునే వారికి జరిమానా విధిస్తామని హెచ్చరించారు. అతివేగం, పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోవద్దని ప్యాసింజర్ వాహనాల డ్రైవర్లకు సూచించారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించే వాహనదారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి, లారీ, ట్రాక్టర్, ఆటో డ్రైవర్ల అసోసియేషన్ల నాయకులు ఖయ్యూం, సత్తార్, యూసుఫ్, దాదాబాషా, డ్రైవింగ్ స్కూళ్ల నిర్వాహకులు పాల్గొన్నారు.

పుచ్చకాయలమాడలో సీఐ పల్లెనిద్ర


గ్రామస్తులతో మాట్లాడుతున్న సీఐ మురళీమోహన్

పత్తికొండ రూరల్: మండల పరిధిలోని పుచ్చకాయలమాడ గ్రామంలో సోమవారం రాత్రి సీఐ మురళీమోహన్ పోలీసు సిబ్బందితో కలిసి పల్లెనిద్ర కార్యక్రమంలో భాగంగా పర్యటించారు. ఈసందర్భంగా ఆయన గ్రామస్తులతో మాట్లాడుతూ ఫ్యాక్షన్, మద్యపానం వల్ల కలిగే అనర్థాలను వివరించారు. రోడ్డు భద్రత గురించి తెలియజేశారు. క్షణికావేశంలో ఆత్మహత్యలకు పాల్పడటం వల్ల తమపై ఆధారపడిన కుటుంబ సభ్యులు రోడ్డున పడతారన్నారు. గొడవలకు తావులేకుండా ప్రశాంతమైన జీవితం గడపాలని సూచించారు.

పెన్షనర్ల సమస్యలు పరిష్కరిస్తాం

● మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి



డైరీని ఆవిష్కరిస్తున్న కమిషనర్

ఎమ్మిగనూరు టౌన్: పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి తెలిపారు. సోమవారం పెన్షనర్ల సంఘ కార్యాలయంలో రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం నూతన సంవత్సర డైరీని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో సంఘం నాయకులు ఏపీ వీరన్న, జీఎస్ అబ్దుల్ కరీం, సభ్యులు సుందరీబాయి, హనుమంతారావు, గురువయ్య, వెంకటరెడ్డి, లక్ష్మన్న, సుబ్బరాయుడు, హనుమప్ప, దస్తగిరి పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి


వెల్దుర్తి తహసీల్దార్ రాజేశ్వరికి వినతిపత్రం సమర్పిస్తున్న అంగన్‌వాడీలు

కృష్ణగిరి: అంగన్‌వాడీ కార్యకర్తల సమస్యలు పరిష్కరించాలని ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ డోన్ డివిజన్ ప్రధాన కార్యదర్శి చాందిని సోమవారం తహసీల్దార్ పురుషోత్తంకు వినతిపత్రం సమర్పించారు. ముఖ ఆధారిత హాజరు తీసివేయాలని, ఏళ్లుగా తాము కోరుతున్న డిమాండ్లు నెరవేర్చాలని అందులో పేర్కొన్నారు. ఆమె వెంట అసోసియేషన్ మండల ప్రతినిధులు సుజాత,విజయలక్ష్మి,రజిని, గంగాభవాని ఉన్నారు.

వెల్దుర్తి: సమస్యలు పరిష్కరించాలని తహసీల్దార్ రాజేశ్వరికి అంగన్‌వాడీ కార్యకర్తలు సోమవారం స్పందన కార్యక్రమంలో వినతిపత్రం సమర్పించారు. అంతకు ముందు వీరికి మద్దతుగా ఏఐటీయూసీ మండల అధ్యక్షుడు మాధవస్వామి, అనుబంధ ఏపీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోషియేషన్ రాష్ట్ర కార్యదర్శి లలితమ్మ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తింపు, కనీస వేతనం, గ్రాట్యూటీ అమలు, రిటైర్మెంట్ వయసు పెంపు, సరుకుల బిల్లులు సమయానికి చెల్లింపు, పింఛన్ సౌకర్యాలతోపాటు ఇటీవల ప్రభుత్వం అమలు చేస్తున్న ఫేస్ అథెంటికేషన్ తీసేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ మండల అధ్యక్ష, కార్యదర్శులు ఈదమ్మ, విజయకుమారి, ప్రతినిధులు సరస్వతి, మహాలక్ష్మి, వరలక్ష్మి, రేణుక, షబానా, జ్యోతి, రామలక్ష్మి, సుజాత పాల్గొన్నారు.

ఆస్పరి: తమ సమస్యలు పరిష్కరించాలని సోమవారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కార్యకర్తలు తహసీల్దార్ కుమారస్వామికి వినతి పత్రం ఇచ్చారు. ఈసందర్భంగా ఏఐటీయూసీ మండల కార్యదర్శి కృష్ణమూర్తి మాట్లాడుతూ వేతనం రూ.26వేలకు పెంచాలని, పని భారాన్ని తగ్గించాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు సరోజమ్మ, ప్రమీలమ్మ, చిట్టెమ్మ, నాగమణి, ఎలిజబెత్ రాణి పాల్గొన్నారు.